క్లుప్తంగా

పెనమలూరులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న దాదాపు 60 మంది రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు పిలిచారు. రౌడీషీటర్ల రోజువారీ దిన చర్యల వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. క్రమశిక్షణతో మెలగాలని ఇన్‌చార్జ్ సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు ఉపదేశించారు. ఇటీవల కొందరు రౌడీషీటర్లు శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో ఉండి ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని హెచ్చరించారు.

సీపీఎం శిక్షణ తరగతులు ప్రారంభం



ఉంగుటూరు: మండలంలోని పెదఅవుటపల్లిలో సీపీఎం గన్నవరం నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. తొలుత పార్టీ సీనియర్ నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. సుందరయ్య చిత్ర పటానికి మహిళా నాయకులు కె.జ్యోతి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, సీపీఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, అజ్మీర వెంకటేశ్వరరావు, రామరాజు పాల్గొన్నారు.

భారీ వర్షంతో కూలిన గోడ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారీ వర్షంతో కేఎల్‌రావు పార్కులో ప్రహరీ కూలిపోయింది. కేఎల్‌రావు పార్కు లోపల తూర్పు వైపున కొన్ని ప్రయివేటు భవనాలు ఉన్నాయి. ఆయా భవనాల ప్రహరీ గోడలు పార్కు లోపల వైపు ఉన్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకుతోడు శనివారం రాత్రి 11 గంటలకు కురిసిన భారీ వర్షంతో ప్రహరీ కూలి పార్కు లోపల వాకింగ్ ట్రాక్‌పై పడింది. ఘటనలో ఎవరికీ ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కార్పొరేషన్ సిబ్బంది వెంటనే ప్రహరీ శిథిలాలను తొలగించి వాకర్లకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

నేటి నుంచి కార్యదర్శులకు శిక్షణ

విజయవాడరూరల్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు మూడవ బ్యాచ్‌కు సోమవారం నుంచి 16వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సున్న సచివాలయం 2,3 గ్రేడు 5 కార్యదర్శులు, పి.నైనవరం, పైదూరుపాడు, పాతపాడు, ప్రసాదంపాడు 2,3, రామవరప్పాడు 2,3, 5, రాయనపాడు గ్రామాల గ్రేడు 5 కార్యదర్శులకు శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు బ్యాచ్‌లకు జరిగిన ట్రైనింగ్ క్లాసులకు హాజరు కాలేని వారు ఈ దఫా జరిగే శిక్షణకు రావచ్చన్నారు.గుణదలలోని సోషల్ సర్వీసు సెంటర్లో 6 రోజుల పాటు జరిగే ట్రైనింగ్ క్లాసులు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచే ప్రారంభమవుతాయన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నదీ జలాలతో సంప్రోక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామికి అన్నపూర్ణాదేవికి కళాకర్షణ, సమస్త నదీ జలాలతో సంప్రోక్షణ జరిగింది. రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యాన ఆదివారము ఉదయం నుంచి అమ్మవారికి మూలమంత్ర హోమములు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహా అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వి. సురేష్ బాబు, కాకినాడ జోన్ ఉపకమిషనర్ మేడిపల్లి విజయరాజు, విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఆలయవంశపారం పర్య ధర్మకర్తలు, స్థానిక పెద్దలు, దాతలు భక్తులు పాల్గొన్నారు.

డేంజర్ జోన్ @ గంగూరు

- తరచుగా రోడ్డు ప్రమాదాలు
- లైట్లు వెలగక నెల రోజులుగా అంధకారం
- డేంజర్ జోన్‌గా గుర్తించినా చర్యలు నిల్



ప్రమాదాలకు కేంద్రంగా ఉన్న గంగూరు సెంటర్

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి గంగూరు సెంటర్ వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉంది. జాతీయ రహదారి ఈ ప్రాంతంలో మలుపు తిరిగి ఉండటం, రాత్రి సమయాలలో రహదారిపై లైట్లు సరిగా వెలగక పోవటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి ఐదేళ్ల క్రితం నిర్మాణం చేసినా సాంకేతికపరంగా అనేక లోపాలు ఉన్నాయి. గ్రామాల కూడళ్ల వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేయలేదు. ప్రధాన కూడళ్ల వద్ద డివైడర్ కటింగ్‌లు మాత్రమే ఇచ్చారు. జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. డివైడర్ కటింగ్‌ల వద్ద స్థానిక ప్రజలు రోడ్డు దాటే సమయంలో వాహనాలు వేగంగా రావటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గంగూరు సెంటర్‌లో ఇప్పటికే చాలా మంది ప్రమాదాల కారణంగా మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తరచుగా ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో అంధకారం..

గంగూరు సెంటర్‌లో గత నెల రోజులుగా రాత్రి వేళల్లో లైట్లు వెలగక పోవటంతో అంధకారంగా మారింది. గంగూరు సెంటర్‌కు దగ్గరలోనే భారీ వాహనాలు నిలుపుదల చేయటానికి ఎన్‌హెచ్‌ఐ అధికారులు పార్కింగ్ ఏర్పాటు చేసినా అక్కడ కూడా లైట్లు వెలగటం లేదు. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దావులూరు టోల్



రాత్రి వేళల్లో అంధకారంలో గంగూరు సెంటర్

గేట్ వద్ద వాహనదారుల ముక్కుపిండి మరీ టోల్ రుసుము వసూలు చేస్తున్నా జాతీయ రహదారిపై లైట్లు వెలుగుతున్నాయా లేదా అని అధికారులు పరిశీలించటంలేదు. ఇప్పటికైనా అధికారులు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డేంజర్ జోన్‌గా గుర్తింపు...

ఇటీవల జరిగిన ఎన్‌హెచ్‌ఐ అధికారుల సమావేశంలో గంగూరు సెంటర్‌ను డేంజర్ జోన్‌గా గుర్తించారు. సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు గంగూరు సెంటర్‌లో సమస్యలు పరిష్కారం అవలేదు. రోడ్డుపై ఉన్న లైట్లు వెలగటం లేదు. ఇక్కడ మరిన్ని ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోకముందే అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గంగూరు సెంటర్‌లో ప్రమాదాల నివారణకు అధికారులు వెంటనే స్పందించాలని, రోడ్డుపై ఏర్పాటు చేసిన లైట్లు వెలిగేలా చూడాలని, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అండర్ పాస్ కూడా ఏర్పాటుచేస్తే చాలావరకు ప్రమాదాలను నియంత్రించగలుగుతారని అంటున్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం..



విజయవాడ 8వ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సంస్థ పార్కులో పచ్చదనం సందర్శకులకు ఆహ్లాదం పంచుతోంది. ఇక్కడ గతంలో ప్రహరీ సరిగా లేక పిచ్చి మొక్కలు పెరిగి చాలా అపరిశుభ్రంగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పార్కుకు మహర్దశ పట్టింది. ఇక్కడ శుభ్రం చేసి మొక్కలు నాటడమే కాకుండా పార్కులో ఆహ్లాదాన్ని పంచడానికి ఫ్లేవర్ బ్లాక్స్ అమర్చారు. స్థానికులు సాయంత్రం వేళ వాకింగ్‌కు అనువుగా ఉంది. ఉదయం వేళ ఈ పార్కులో స్థానికుల కోసం అధునాతన వ్యాయామ సామగ్రి(జిమ్ పరికరాలు)ని కూడా అమర్చారు. ఈ పార్కును తీర్చిదిద్దడానికి సుమారు రూ.3 లక్షల వ్యయమైంది. ఉద్యానవనం ముస్తాబై ఇప్పుడు అందరికీ ఆహ్లాదాన్ని పంచుతోంది.

–మొగల్రాజపురం(విజయవాడతూర్పు)





సమస్యకు చావు పరిష్కారం కాదు



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్కే అయోధ్య



హాజరైన విద్యార్థులు

డాక్టర్ ఆర్కే అయోధ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏ సమస్యకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్కే అయోధ్య అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఆర్కే అయోధ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇటీవల మానసిక ఒత్తిడులు అధికమయ్యాయన్నారు. ప్రతి గంటకు పదులు సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పనికిరాం అనే భావనతో ఉన్నవారు, నిరాశవాదం, నాకు ఎవరూ సాయం చేయరూ...? అనే భావనలతో ఉన్నవారు ఆ ఒత్తిడిని ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఏటా దేశంలో లక్షన్నర మంది ఆత్మహత్యలకు గురై అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకోవటానికి కూడా ధైర్యం కావాలన్నారు. ఆ ధైర్యాన్ని సమస్యలను ఎదుర్కోవటానికి ఉపయోగించి ఆశతో ముందడుగు వేస్తే మంచి విజయాలు సొంతమవుతాయని వివరించారు. మానసిక సమస్యలు, కారణాలు, ఆత్మహత్యలు తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరిభాషలో పలు శాస్త్రీయ పేర్లు ఉన్నా యువత ఎక్కువగా ఈ సమస్యలకు గురవుతున్న విషయాలను సర్వేలు తెలియజేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ ఎడిక్షన్ సమస్యలు ఇటీవల అధికమయ్యాయన్నారు. ఎంతో కోల్పోయామనే భావనను చుట్టుపక్కల వ్యక్తుల వద్ద వ్యక్తం చేస్తారని తెలిపారు. అటువంటి వ్యక్తులు తారసపడినప్పుడు వారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ యువత ఇలాంటి చర్యల ద్వారా వారు తమ వ్యక్తిగత జీవితాన్ని బలి చేసుకోవటమే కాకుండా కుటుంబానికి తీరని వ్యథను మిగుల్చుతున్నారన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి ఇతర మార్గాలను అన్వేషించాలుగానీ ఆత్మహత్యకు పాల్పడవద్దని సూచించారు. యువతలో గొప్ప శక్తియుక్తులు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.భాగ్య కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ పీవో వీఎస్‌రావు స్వాగతం పలకగా, మరో పీవో ఎన్.సాంబశివరావు వందన సమర్పణ చేశారు.

రిటైనింగ్ వాల్‌తో భద్రత

- పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం
- రహదారి మార్జిన్ల పటిష్టత
- పూర్తయిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు



ప్రొద్దుటూరు చానల్‌లో నిర్మించిన రిటైనింగ్ వాల్

కంకిపాడు: రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పంట కాలువ గట్లకు, రహదారికి భద్రత చేకూరింది. నీటి నిల్వ సామర్థ్యం పెంపుదలతో పాటుగా, ముంపు సమస్య పరిష్కారమైంది. ఎట్టకేలకు రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తికావటంతో ప్రజలు ఆనందంతో ఉన్నారు.

ముంపు సమస్య...

కంకిపాడు సెక్షన్ పరిధిలోని ప్రధాన పంట కాలువల్లో ప్రొద్దుటూరు చానల్ కూడా ఒకటి. కంకిపాడు నుంచి ప్రొద్దుటూరు, దావులూరు, చలివేంద్రపాలెం మీదుగా ఈ కాలువ సాగుతుంది. దీని పరిధిలో 5 వేలకు పైగా ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. కాలువ కట్టలు పటిష్టంగా లేకపోవటంతో కాలువకు నీరు విడుదల చేసిన ప్రతిసారీ కట్టల మీదుగా ప్రవహించి సాగునీరు వృథా కావటమే కాకుండా పంట పొలాలు ముంపు బారిన పడేవి.

రూ.60 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణం

ఈ సమస్యను స్థానిక రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రొద్దుటూరు కాలువ వెంబడి ప్రొద్దుటూరు ప్రధాన గ్రామంలో వంతెనకు దిగువన రిటైనింగ్ వాల్‌ను రహదారి మార్జిన్‌కు అనుసంధానంగా నిర్మించారు. దీంతో రోడ్డు కోత సమస్యకు చెక్ పడింది. అంతేకాకుండా ఈ పనుల నేపథ్యంలో కాలువ పూడికతీత, కట్టలు పటిష్టపర్చటంతో కాలువ ద్వారా సాగునీరు సమృద్ధిగా దిగువకు పారుదల అవుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు వృథా, పంట పొలాల ముంపు సమస్యలు పునరావృతం కాలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం

రిటైనింగ్ వాల్ నిర్మాణం పటిష్టంగా పూర్తి చేశాం. రూ.60 లక్షల అంచనాతో నిర్మాణం జరిగింది. పంట పొలాల ముంపు సమస్య, రహదారి కోత పరిష్కారం అయ్యాయి. నిర్మాణ పనుల్లో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ ప్రయోజనకరంగా పూర్తిచేశాం.

వీరాంజనేయులు,
ఏఈ, ఇరిగేషన్ సెక్షన్, కంకిపాడు

డ్రైనేజీ నిర్మాణ పనులు వేగిరం

అధికారులకు ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశం



కానూరు సనత్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: సనత్‌నగర్‌లో నిర్మాణం చేస్తున్న డ్రైనేజీ పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు సనత్‌నగర్‌లో రూ.50 లక్షలతో ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. అయితే వర్షం కురవటంతో డ్రైనేజీ నీరు సనత్‌నగర్ నుంచి తులసీనగర్ వద్దకు నిలిచిపోయాయి. ఆదివారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సనత్‌నగర్‌కు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. గత ప్రభుత్వ పాలనలో సనత్‌నగర్ అభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం చూపారని, ఈ కారణంగా సనత్‌నగర్‌లో కనీస వసతులు లేకుండా ఉన్నాయన్నారు. తమ హయాంలో అనేక అంతర్గత రోడ్లు నిర్మాణం చేశామన్నారు. ప్రధాన డ్రైనేజీ నిర్మాణం చేసి సనత్‌నగర్‌లో శాశ్వతంగా మురుగునీరు సమస్య పరిష్కారం చేస్తామని చెప్పారు. డ్రైనేజీ నిర్మాణం చేస్తున్న సమయంలో వర్షం కురవటంతో పనులకు ఆటంకం కలిగిందని తెలిపారు. డ్రైనేజీ నిర్మాణం పనులు వేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చాంద్‌బాషా, అబ్దుల్ రెహమాన్, పఠాన్ అహ్మద్, అజీజుల్లా, సిద్ధిక్, సైకం చినబాబు, వల్లభనేని మణికంఠ, ముత్తు, పలువురు పాల్గొన్నారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారులకు అర్జీల ద్వారా తెలియజేయాలని కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముందస్తు భద్రత చర్యలు

గన్నవరం:స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగుతారనే సమాచారం మేరకు జాతీయ రహదారిపై పలు కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీచౌక్, సినిమా హాల్ సెంటర్, బస్టాండ్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సీఐ పి. కనకరావు పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజాకు సత్కారం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏపీ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్‌గా ముతవల్లీ కోటాలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన షేక్ ఖాజాను ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ముస్లిం మత పెద్దలు ఆదివారం ఘనంగా సత్కరించారు. సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముస్లిం మైనార్టీల పెద్దలు అధిక సంఖ్యలో ఖాజాకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, షేక్ వెంకట్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు చింతా శ్రీను, కంభగల రాజు, మున్షీ, అబ్జల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

40 ఏళ్లకు కలిసిన ఎస్ఏఎస్ కాలేజ్ 1981–84 బీకాం విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సయ్యద్ అప్పలస్వామి కళాశాల బీకాం 1981–84 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. నాలుగు దశాబ్దాల తరువాత సీనియర్ సిటిజన్స్ అయ్యాక ఇప్పుడు వారంతా కలిసి గత స్మృతులను పంచుకున్న క్షణాలు మధురానుభూతులను పంచాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి స్మృతులను తలచుకుని ఆనందపరవశులయ్యారు. పూర్వ అధ్యాపకులకు నమస్కరించి ఆశీస్సులందుకున్నారు. ముఖ్యఅతిథి స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పూర్వ విద్యార్థులను, పూర్వ అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్లు వసంత్‌కుమార్, ఎన్వీరావు, పూర్వ అధ్యాపకుడు ఎ.లోకాభిరామయ్య, అధ్యాపకులు కేవీ శ్యామ్‌సుందర్, వీవీ సుబ్బారావు, కేఎల్ నరసింహారావు, పి.శివరామప్రసాద్, సోమసుందరావు, విజయశ్రీ పాల్గొన్నారు.

12 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్లో మండలస్థాయి క్రీడాపోటీల నిర్వహణపై వ్యాయామోపాధ్యాయులతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 12,13 తేదీల్లో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన అండర్–14 బాలుర విభాగంలో, 13వ తేదీన అండర్–14 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు ఫోన్ నంబర్ 9491735353ను సంప్రదించవచ్చని సూచించారు. విశ్రాంత పీడీ అక్కినేని రాఘవేంద్రరావు, పీడీలు బీఎస్ రామచంద్రుడు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, తానియా గిరి పాల్గొన్నారు.

దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఆదివారం శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయంలోని శ్రీ శివకామేశ్వరికి శ్రావణ మాసం పురస్కరించుకుని కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం జరిగింది. నీలకంఠేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.